క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అష్టోత్తరం, స్తోత్రపారాయణం చేశారు.

శివయ్యకు నృత్యార్చన



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై కర్నూలుకు చెందిన టీవీ.గంగాధరం వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన నిర్వహించారు. గణేశకౌత్వం, సిద్ధి వినాయక, శివశివ భవ భవ, జతిస్వరం, ఆనందతాండవం, శివతాండవం, రాజరాజేశ్వరి అష్టకం తదితర గీతాలు, అష్టకాలకు విజేత, శ్రీవాణి, పార్వతమ్మ, అక్షర, ఆధ్య, అఖిల, బృంద, హర్షిత, హర్షిణి, చైత్రిక తదితరులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

కృష్ణాజలాల సవ్వడి



సంగమేశ్వరం వద్ద ఎగువ పుష్కర ఘాట్‌ను తాకిన కృష్ణాజలాలు

కొత్తపల్లి: సప్తనదీ సంగమం.. సంగమేశ్వరం వద్ద కృష్ణాజలాలు మంగళవారం ఎగువ పుష్కర ఘాట్‌ను తాకాయి. ఎగువన జూరాల నుంచి శ్రీశైలానికి భారీగా వరద జలాలు చేరుతున్నాయి. సుమారు 4,02,960 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో జలాశయం నీటిమట్టం 883 అడుగులకు చేరుకుంది. దీంతో మంగళవారం మండల పరిధిలోని సప్తనది సంగమేశ్వరంలో లలితా సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న ఎగువ పుష్కర ఘాట్‌ను కృష్ణాజలాలు తాకాయి. కనుచూపుమేర జలాలతో సంగమేశ్వరం వద్ద సముద్రాన్ని తలపిస్తోంది.

సుంకులమ్మకు బోనాలు



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

మహానంది: గాజులపల్లె గ్రామంలో కొలువైన సుంకులమ్మ, కర్రెమ్మ అమ్మవారికి గ్రామస్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మహిళలతో పాటు చిన్నారులు ప్రత్యేకంగా అమ్మవార్లకు నైవేద్యాలు తయారు చేసి బోనాల ద్వారా తీసుకుని ఆలయాలకు వెళ్లి సమర్పించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

వీబీఆర్‌కు కొనసాగుతున్న నీటి ప్రవాహం



వీబీఆర్‌లోకి వస్తున్న కృష్ణా జలాలు

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాల ప్రవాహం కొనసాగుతోంది. మంగళవారం బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ ద్వారా వీబీఆర్‌కు 16 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నట్లు ఏఈ శివనాయక్ తెలిపారు. బుధవారం ఉదయానికి వీబీఆర్‌లో 4 టీఎంసీల నీరు నిల్వ ఉండే అవకాశం ఉందని ఏఈ చెప్పారు. రిజర్వాయర్‌లోకి నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహానందిలో ఏపీ ఎన్‌జీఓస్ జనరల్ సెక్రటరీ

మహానంది: మహానందీశ్వరుడిని ఏపీ ఎన్‌జీఓస్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పురుషోత్తమనాయుడు, కార్యవర్గ సభ్యుడు వెంగళరెడ్డి, సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం వేదపండితులు స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

చిరుతను బంధించాలి

మహానంది: మహానందిలోని ఈశ్వర్ నగర్ కాలనీలో మంగళవారం రాత్రి మరోసారి చిరుత కనిపించిందని స్థానికులు తెలిపారు. అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కాల్ చేస్తే స్థానిక ఉద్యోగి తమ నంబర్లు బ్లాక్ లిస్టులో పెట్టారని మహిళలు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చిరుతను బంధించాలని కోరారు.

హంద్రీ - నీవా కాల్వకు అడ్డుకట్ట



హంద్రీ - నీవా కాలువలో అడ్డుకట్టను చూపుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: హైవే రోడ్డు నిర్మాణ పనులు రైతులకు శాపంగా మారాయని సీపీఎం నాయకులు ఫక్కీర్ సాహెబ్ మండిపడ్డారు. మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామ సమీపంలో వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా హంద్రీ – నీవా కాలువలో నీరు ప్రవహించకుండా మట్టితో వేసిన అడ్డుకట్టను సీపీఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్నూలు, అనంతపురం జిల్లాలకు సాగు, తాగునీరు అందించేందుకు చేపట్టిన మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి నీరు ప్రవహించకుండా హైవే నిర్మాణం చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం డ్యాంకు నీరు చేరిందని, జిల్లాలో ఆశించిన మేర వర్షాలు లేక పంటలు ఎండుతున్నాయని చెప్పారు. ఈ స్థితిలో వంతెన నిర్మాణం కోసం కాలువలో నీరు ప్రవహించకుండా మట్టితో అడ్డుకట్ట వేసి రెండు జిల్లాల రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. అధికారులు స్పందించి మట్టికట్టను తొలగించి హంద్రీ – నీవాకు నీరు వదలకపోతే రైతులు, ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు, రైతులు శ్రీకాంత్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకట్టను తొలగించాలి

కర్నూలు(సెంట్రల్): తక్షణమే బ్రాహ్మణకొట్కూరు సమీపంలో హంద్రీనీవా కాలువలో వేసిన మట్టికట్టను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాలువ పక్కనే నేషనల్ హైవే నిర్మాణ పనులు జరుగుతుండడంతో ప్రత్యేకంగా బ్రిడ్జిని నిర్మించకుండా కాలువలోనే మట్టిని వేసి వాహనాలు వెళ్లేలా చేశారని పేర్కొన్నారు. దీంతో హెచ్ఎన్ఎస్ఎస్‌కు నీటిని విడుదల చేయలేకపోయారని, ఈ కాలువ ద్వారా ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందాల్సి ఉందని వివరించారు. ఈ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే మట్టికట్టను తొలగించి రహదారి కోసం బ్రిడ్జిని నిర్మించుకోవాలన్నారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆటో కార్మిక యూనియన్ జెండాను ఎగురవేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నందికొట్కూరు: ప్రభుత్వం ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మజీద్‌మియా, ఉపాధ్యక్షుడు లాజరస్ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో మంగళవారం ఆటో యూనియన్ జెండాను ఐఎఫ్‌టీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో కార్మికులు యూనిట్‌గా ఉండాలన్నారు. క్రమశిక్షణతో ముందుకు సాగాలని, మద్యానికి బానిస కాకుండా ప్రజలకు సేవకులుగా ఉండాలని చెప్పారు. ఆటో కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మిక యూనియన్ నాయకులు సామేలు, నవీన్‌కుమార్, ఇస్మాయిల్, ఐఎఫ్‌టీయూ నాయకురాలు చూరిబీ, తదితరులు పాల్గొన్నారు.


2న మండల సర్వసభ్య సమావేశం

పగిడ్యాల: మూడు నెలలకోసారి నిర్వహించే మండల సాధారణ సర్వసభ్య సమావేశంను ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కవిరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే మండల స్థాయి అధికారులు బుధవారం ప్రగతి నివేదికలను కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ)కు అందజేయాలని కోరారు. అలాగే మండల ప్రాదేశిక నియోజకవర్గ ఎంపీటీసీలు, కో–ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. హాజరుకాని అధికారులపై తగు చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపుతామని ఎంపీడీఓ వెల్లడించారు.

ఆత్మకూరులో 4.2 మి.మీ. వర్షం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలో మంగళవారం ఉదయం 4.2 మి.మీ. వర్షం కురిసింది. ఈ నెలలో 167 మి.మీ. సాధారణ వర్షపాతం కాగా అధిక వర్షాలు కురిసినట్లు అధికారులు చెబుతున్నారు. వర్షాలు ఇలానే కురిస్తే మండలంలో సాగుచేసిన కంది, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆలయాల్లో వరుస చోరీలు



వెంకటాపురంలో చోరీ జరిగిన మల్లేశ్వరస్వామి దేవస్థానం

ఆత్మకూరు: మండలంలో రెండు రోజులుగా వరుసగా దేవస్థానాల్లో చోరీలు జరుగుతున్నాయి. దొంగలు హుండీలనే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేస్తున్నారు. ఆలయంలోని ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి హుండీల్లోని నగదు, బాండ్లను అపహరించిన ఘటనలు చోటు చేసుకున్నాయి. వివరాల్లోకి వెళితే.... సోమవారం ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన మల్లేశ్వరస్వామి దేవస్థానంలో దొంగలు పడ్డారు. రెండు హుండీలను పగలగొట్టి రూ.30 వేలు అపహరించినట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం వేకువజామున మండలంలోని బాపునంతపురం గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో చోరీ జరిగింది. ఈ ఘటనలో నగదు ఎంత పోయిందో స్పష్టంగా తెలియడం లేదు. గ్రామంలో రూ.50 వేలు చోరీ చేశారు. అలాగే రూ.3 లక్షలు విలువచేసే బాండ్లను కూడా దొంగలు చోరీ చేసినట్లు తెలుస్తోంది. కాగా రెండురోజులుగా దేవాలయాల్లో దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనే గత నెలలో పాముల పాడు మండలంలోని జూటూరు, జూపాడుబంగ్లా మండలంలోని బన్నూరు దేవాలయాల్లో జరిగాయి. ఇటీవల వరుసగా దేవాలయాల్లో హుండీలను పగులగొట్టి చోరీలు జరగడంతో భక్తులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

శనగల బసవన్నకు ప్రత్యేక పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శనగల బసవన్న (నందీశ్వరుడు), బయలువీరభద్రస్వామి వారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రదోష కాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. గణపతి పూజ అనంతరం నందీశ్వరస్వామికి వస్త్ర సమర్పణ, విశేషార్చనలు, నానబెట్టిన శనగలు, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

హ్యూమన్ ట్రాఫికింగ్‌పై కఠిన చర్యలు

నందికొట్కూరు: వ్యక్తుల అక్రమ రవాణపై చట్టపరమైన చర్యలు తప్పవని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని స్పష్టం చేశారు. వ్యక్తుల అక్రమ రవాణా నిరోధక దినోత్సవం ఉద్దేశించి పట్టణంలోని కోర్టు ఛాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి మాట్లాడారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే నేషనల్ లోక్ అదాలత్ సెప్టెంబర్ 9వ తేదీన జరుగుతుందని, సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కరించుకునేందుకు చక్కటి అవకాశం అని వివరించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ తప్పక ధరించాలని, హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలకు రక్షణ ఉంటుందని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు, సభ్యులు నాగశేఖరరెడ్డి, ఏపీపీ కృష్ణకిషోర్, కేశాలు, వెంకటేశ్వర్లు, పోలీసు, ఐసీడీఎస్, మున్సిపాలిటీ, లేబర్ అధికారులు, సోషల్ వర్కర్ శోభరాణి, తదితరులు పాల్గొన్నారు.

బోట్లను అనుమతించొద్దని వినతి

శ్రీశైలం: శ్రీశైలంలోని పాతాళగంగలో బోట్లు తిరగకుండా చూడాలని రోప్‌వే, బోట్స్ మేనేజర్ పెంచల్‌రెడ్డి మంగళవారం సాయంత్రం సీఐ ప్రసాద్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. డ్యామ్ గేట్లు తెరిచినందు వల్ల బోట్లు తిరిగితే ఒరవడికి గల్లంతయ్యే అవకాశం ఉందని, సందర్శకులకు ప్రాణహాని జరుగుతుందని పేర్కొన్నారు.పాతాళగంగలో ఎలాంటి బోట్లు, బుట్టలు నడపకూడదని సీఐ హెచ్చరికలు జారీ చేశారు.

ఏజెన్సీ ఉద్యోగుల నిజాయితీ

మహానంది: మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చిన నంద్యాల పట్టణం నందమూరి నగర్ కాలనీకి చెందిన శివ మంగళవారం తన బ్యాగును సుపథ మండపాల్లో మరిచిపోయి వెళ్లాడు. పారిశుధ్య పనులు చేస్తున్న ఏజెన్సీ ఉద్యోగులు మద్దిలేటమ్మ, భవానీ బ్యాగును గుర్తించి సమాచారం కేంద్రంలో అప్పగించారు. దీంతో ఏజెన్సీ ఉద్యోగి మధు అనౌన్స్ చేయడంతో బాధితుడు తన బ్యాగు, బ్యాగులో ఉన్న సెల్‌ఫోన్ తీసుకున్నాడు. దేవస్థానం సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పురుగు మందుల విక్రయాలపై తనిఖీ



సింగరాజుపల్లెలో తనిఖీ చేస్తున్న ఏఓ మహేష్

కొత్తపల్లి: గ్రామాలలో ఎవరైనా లైసెన్స్ లేకుండా, నిషేధిత పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ హెచ్చరించారు. మండల పరిధిలోని సింగరాజుపల్లె గ్రామంలో పురుగు మందుల విక్రయాలపై మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో లైసెన్స్ లేకుండా, అక్రమంగా పురుగు మందులు, గుళికలు అమ్మరాదని హెచ్చరించారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలో తనిఖీ చేయగా కుమ్మరి లక్ష్మణ్ ఆర్గానిక్ గుళికలు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. తదుపరి విచారణ నిమిత్తం వాటిని స్వాధీనం చేసుకొని స్థానిక రైతుసేవా కేంద్రానికి తరలించినట్లు చెప్పారు. రైతులు లైసెన్స్ లేని డీలర్ల వద్ద ఎరువులు, పురుగు మందులు కొని మోసపోవద్దని సూచించారు. గ్రామాలలో ఎవరైనా అనధికారికంగా పురుగుమందుల విక్రయాలు చేస్తుంటే మండల వ్యవసాయాధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. తనిఖీల్లో గ్రామ రెవెన్యూ అధికారి నరసింహ, ఎంఎస్‌కే జ్యోతిలక్ష్మి, కానిస్టేబుల్ అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

మహానంది: మండలంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు ఆదేశించారు. ఏ.కోడూరు గ్రామంలో ఏఓ హనీఫ్‌తో కలిసి మంగళవారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

రైతుల నుంచి సొమ్ము వసూలు చేయొద్దు



నాగటూరు ఫేజ్-1, -2 ఎత్తిపోతల పథకాల నుంచి నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: రైతుల నుంచి నగదు వసూలు చేస్తే సహించే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే జయసూర్య స్పష్టం చేశారు. ఆయన మంగళవారం మండల పరిధిలోని నాగటూరు ఫేజ్–1–2 ఎత్తిపోతల పథకాల నుంచి సాగు నీటిని విడుదల చేశారు. కొత్త కమిటీలు ఏర్పాటు చేయకుండా నామమాత్రపు కమిటీతో నీటి విడుదల కానిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల నుంచి ఎకరానికి రూ.వెయ్యి చొప్పున వసూలు చేయడం సరైంది కాదన్నారు. ఏటా రైతుల నుంచి వసూలు చేసిన నగదు ఏమి చేశారని ప్రశ్నించారు. ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించేందుకు ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తుందని స్పష్టం చేశారు. ఏటా రైతుల నుంచి వసూలు చేసిన డబ్బులకు లెక్కలు చూపించకుండా ఇష్టానుసారంగా సొంత ఖర్చులకు వాడుకుంటున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈయన వెంట అధికారులు, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, నవీన్, తదితరులు ఉన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

నందికొట్కూరు: పొగాకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(కోట) హెచ్ఎం సలీంబాషా సూచించారు. పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం టొబాకో ఫ్రీ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో జరిగిన పొగాకు నిర్మూలన కార్యక్రమంలో హెచ్ఎం మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలు బీడీ, సిగరెట్, తంబాకు, గంజాయి, పొగాకు వంటి ఉత్పత్తుల వల్ల కలిగే ఆరోగ్య నష్టాల గురించి తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రులు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను పిల్లలకు వివరించి చెప్పాలన్నారు. అనంతరం విద్యార్థులు పొగాకు ఉత్పత్తులు వద్దు.. ఆరోగ్యం ముద్దు, పొగాకు నమలవద్దు – అనారోగ్యం పాలు కావద్దు అని ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లబోమని విద్యార్థులతో హెచ్ఎం ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు సాలమ్మ, లలితమ్మ, సరోజిని దేవి, షంషాద్, బేగం, వెంకరమణ, మల్లికార్జునరెడ్డి, నాగశేషులు, రామిరెడ్డి, పీడీ శ్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న సెబ్, డీటీఎఫ్ పోలీసులు

నందికొట్కూరు: స్థానిక సుబ్బారావుపేటలో తెలంగాణ మద్యం విక్రయిస్తున్న టి.లోకేశ్వరుడు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ సీతారామిరెడ్డి చెప్పారు. పట్టణంలో తెలంగాణ మద్యం విక్రయిస్తున్నట్లు మంగళవారం సమాచారం రావడంతో నంద్యాల డీటీఎఫ్ టీమ్ వారితో కలిసి దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిందితుడి నుంచి 25 బాటిళ్ల తెలంగాణ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో నంద్యాల డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, ఎస్ఐలు నాగరాజు, మోహన్ కృష్ణ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ప్రాణాలు నిలిపిన ఉచిత ఇంజెక్షన్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మార్కు

వెలుగోడు: వెలుగోడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రూ.40 వేలు విలువ చేసే ఇంజెక్షన్‌తో గుండెపోటుకు గురైన వ్యక్తి ప్రాణాలు నిలిపారు. గుండె సంబంధిత వ్యాధులపై గత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గుండెపోటు వచ్చిన వారికి మొదటి గంటలోనే అత్యవసర ప్రాథమిక చికిత్సను అందించడం ద్వారా ప్రాణాలు నిలబెట్టే స్టెమి ప్రాజెక్టుకు వైద్య ఆరోగ్య శాఖ అప్పట్లో శ్రీకారం చుట్టింది. గుండెపోటు సంభవించిన తొలి గంట చాలా కీలకం. దీనిని గోల్డెన్ అవర్ అంటారు. ఈ గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించడం ద్వారా రోగి ప్రాణాలు నిలబెట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గుండెపోటు కారణంగా జరిగే మరణాలను తగ్గించేందుకు ఐసీఎంఆర్ సహకారంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆస్పత్రుల్లో రూ.40 వేలు విలువ చేసే ఇంజెక్షన్లు అందజేసింది. ఈ ఇంజెక్షనే ఇప్పుడు ఓ రోగి ప్రాణాలు నిలిపింది. వివరాల్లోకి వెళ్తే.. గుంతకందాల గ్రామానికి చెందిన మార్కు(35) కు మంగళవారం గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు వెలుగోడు పట్టణంలోని సీహెచ్‌సీ కేంద్రానికి తరలించారు. రోగిని పరీక్షించిన వైద్యాధికారి విక్రమ్ ఖాన్ ఎలాక్షిమ్–40 ఎంజీ ఐవీని ఇచ్చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స అందిస్తున్నారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడం, ఆ వెంటనే ఇంజెక్షన్ ఇవ్వడంతో ప్రాణాలతో బయటపడ్డారని వైద్యులు తెలిపారు.

25 వేల క్యూసెక్కుల నీటి విడుదల



పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి విడుదలవుతున్న జలాలు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి రోజురోజుకు నీటి విడుదలను అధికారులు పెంచుతున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరు గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కులకు నీటి సరఫరాను పెంచినట్లు ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శ్రీశైలం జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి 3,88,460 క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతుండగా డ్యాంలో 883.50 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు వెల్లడించారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 882.50 అడుగుల నీటిమట్టం ఉండగా నీటి విడుదలను 23 వేల నుంచి 25 వేల క్యూసెక్కులకు పెంచినట్లు ఏఈ తెలిపారు. ఈ నీటిని బానకచర్ల నీటి నియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 15 వేలు, కేసీఎస్కేప్ కాల్వకు 5 వేలు, జీఎన్ఎస్ఎస్ కాల్వకు 5 వేల క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 350 క్యూసెక్కులు

తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 350 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,540 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 350 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 150 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. నేడు కేసీ కాల్వకు నీటి సరఫరాను 2 వేల క్యూసెక్కులకు పెంచనున్నట్లు సుంకేసుల డ్యాం ఏఈ రాజు తెలిపారు.

కామేశ్వరీదేవికి సారె సమర్పణ



చీర, సారె తెస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

మహానంది: కామేశ్వరీదేవి అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా మహానందికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో చీర, సారె సమర్పించారు. మంగళవారం మహానంది ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు భవనాశి రమణయ్యల ఆధ్వర్యంలో స్వామివారికి పట్టువస్త్రాలు, అమ్మవారికి పట్టుచీర, పిండివంటలు సమర్పించారు. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి సమక్షంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధానార్చకుడు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు వనిపెంట ప్రకాశం శర్మ, టీవీ రాజమాణిక్యశర్మ, రాజారత్తయ్యబాబు ప్రత్యేక పూజలు చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ



విచారణ చేస్తున్న అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్, ఎంపీడీఓ నూర్జహాన్, ఏపీఓ గౌరీబాయి

జూపాడుబంగ్లా: మండలంలోని జూపాడుబంగ్లా, తాటిపాడు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్మిదేవమ్మ, లింగన్నలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఎన్ఆర్ఈజీఎస్ అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. జూపాడుబంగ్లా గ్రామ సచివాలయం–2లో ఆ గ్రామ ఫీల్డ్అసిస్టెంటు లక్ష్మిదేవమ్మపై వచ్చిన ఫిర్యాదుల మేరకు అంబుడ్స్‌మెన్ ఫిర్యాదుదారుల వద్ద విచారణ జరిపారు. ఓ వ్యక్తి తనకు జాబ్‌కార్డు లేదని, తాను కరువు పనులకు వెళ్లడం లేదని పేర్కొనడంతో పాటు తనపేరిట ఎవరో తప్పుడు ఫిర్యాదు చేశారని సమాధానమిచ్చారు. మరికొంత మందిని విచారించగా తాము ఉపాధి పనులకు వెళ్లామని కూలి డబ్బులు తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయని తెలిపారు. గిట్టనివారు తమ పేర్లతో తప్పుడు ఫిర్యాదులు చేశారని స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదులకు తమకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. అనంతరం అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. 20 మంది పేరిట తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఫిర్యాదుదారులను విచారించగా.. ఫిర్యాదులపై తమకు ఎలాంటి సంబంధం లేదని సమాధానమిచ్చినట్లు తెలిపారు. మరింత లోతుగా విచారించి, తమ విచారణలో వెల్లడైన విషయాల నివేదికలను జిల్లా పీడీ రామచంద్రారెడ్డికి అందజేయనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ నూర్జహాన్, ఏపీఓ గౌరీబాయి, ఈసీ నజీర్‌బాషా, టీఏలు చిన్న, తదితరులు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

కొత్తపల్లి: సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ జవహర్ బాబు హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని శివపురం, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతగా సేవలందించాలని సూచించారు. గుమ్మడాపురం సర్పంచ్ విజయ్‌కుమార్, ఉపసర్పంచు బొల్లు శ్రీనివాసులు యాదవ్ ఉన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

శ్రీశైలం టెంపుల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం శ్రీశైలం పర్యటనకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం శ్రీశైలంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఎస్పీ అధిరాజ్ సింగ్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజుతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులు నివారించాలి



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఏడీ డాక్టర్ కె.రాజశేఖర్

జూపాడుబంగ్లా: పశువుల్లో గర్భకోశ వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధిని గమనించిన వెంటనే చికిత్స చేయించాలని ఉమ్మడి కర్నూలు జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఏడీ డాక్టర్ రాజశేఖర్, జూపాడుబంగ్లా ఏడీ రామాంజనేయనాయక్ సూచించారు. మండలంలోని మండ్లెం గ్రామంలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశువుల్లో గర్భకోశ వ్యాధులు–వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశుసంతతి పెంచుకునేందుకు ఈతకు ఈతకు మధ్య కాలాన్ని తగ్గించుకోవాలన్నారు. గేదెల నుంచి విడివడిన దూడల పోషణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గొడ్డుకట్టిన పశువులను గర్భకోశ సంబంధిత వ్యాధులు సోకినట్లుగా పరిగణించి తగిన చికిత్స చేయించడం ద్వారా పశువులు గర్భధారణ పొందే అవకాశం ఉంటుందని వివరించారు. సీజనల్‌గా వ్యాధులు సోకకుండా తగిన చికిత్స అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి లాభాలు ఆర్జించవచ్చునని చెప్పారు. అనంతరం పశువైద్య శిబిరం నిర్వహించి ఉచిత గర్భధారణ పరీక్షలు నిర్వహించి వ్యాధులు సోకిన పశువులకు ఉచితంగా మందులు అందజేశారు. అలాగే పశువులు, కోళ్లు, గొర్రెలకు ప్రభుత్వం షెడ్లను మంజూరు చేసినట్లు ఏడీ రామాంజనేయనాయక్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు షెడ్లను నిర్మించుకోవచ్చన్నారు. పారుమంచాల పశువైద్యాధికారిణి రాగసంధ్య, కర్నూలు డీఎల్‌డీఏ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది భరత్‌కుమార్, రామలక్ష్మి, నీలేశ్వరుడు, వెంకటేశ్‌యాదవ్, వెంకటరమణ, ఏహెచ్ఏ లు లోకసుధీర్, హనుమంతమ్మ తదితరులు పాల్గొన్నారు.